
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం। 30। ఆగస్టు। 2025



ఇంకా సాధారణమే..

జిల్లాలోని 12మండలాల్లో ఇంకా సాధారణ వర్షపాతమే నమోదైనా వరి, మిర్చి మినహా ఇతర పంటల సాగు లక్ష్యాన్ని దాటింది. 8లో



'సొసైటీ' ఎన్నికల నోటిఫికేషన్

పాల్వంచలోని విద్యుత్ ఉత్పత్తి సంస్థల ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ ఎన్నికలకు శనివారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ పెరిగినా సాయంత్రానికి చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య



కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం అంతరాలయంలోని మూల మూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శ నమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీరిన స్వామికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామికి కంక ణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లికి పంచామృత అభిషేకం



అమ్మ వారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువైన శ్రీ కనకదు ర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అమ్మ వారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. తొలుత అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృ తం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమ ర్పించిన అర్చకులు మూలవిరాట్‌కు పం చామృతంతో అభిషేకం చేయడంతో పాటు పంచ హారతులు సమర్పించారు. ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

సాఫీగా యూరియా సరఫరా



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న డీఏఓ బాబూరావు

ములకలపల్లి: రైతులు ఇబ్బంది పడకుండా యూరియా సరఫరా చేయాలని జిల్లా వ్యవసా యాధికారి(డీఏఓ) బాబూరావు సూచించారు. ములకలపల్లి పీఏసీఎస్‌ను శుక్రవారం తనిఖీ చేసిన ఆయన గోదాంలో ఎరువుల నిల్వలను పరిశీలించారు. అనంతరం డీఏఓ మాట్లా డుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు యూరియా అమ్మకాలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఎవరైనా అవకతవకలకు పాల్పడినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆత్మ డీపీఓ సరిత, ఏఓ అరుణ్‌బాబు, ఏఈఓ సుజాత, సీఈఓ కుంచారపు శ్రీనివాసరావు, గోదాం ఇన్‌చార్జ్ బొమ్మకంటి కామేశ్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌గా మంగపతిరావు

ఖమ్మం సహకారనగర్: ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌గా కూరపాటి మంగపతిరావు నియమితులయ్యారు. ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను కోఆర్డినేటర్‌గా నియమిస్తూ ఖమ్మం అదనపు కలె క్టర్ శ్రీజ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కోఆర్డినేటర్‌గా ఉన్న మద్దినేని పాపారావు ఖమ్మం అర్బన్ మండలం పుట్టకోట హైస్కూల్ ఎస్‌ఏగా బాధ్యతలు నిర్వర్తించను న్నారు. కాగా, మంగపతిరావు శనివారం బాధ్య తలు స్వీకరించే అవకాశం ఉంది.

అంతా.. మనీ అమ్మా!





హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ (ఫైల్)

దమ్మపేట మండలం చీపురుగూడెం బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు నాసిర కమైన భోజనం పెడుతున్నారని ఆరోపించిన వీడియోలు ఈనెల 3న సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చాయి. దీంతో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తనిఖీ చేయగా కుళ్లిపోయిన టమాటాలతో కూర వండిన విషయం బయటపడింది. ఆ తర్వాత 13వ తేదీన అంకంపాలెం గిరిజన గురుకుల బాలికల కళాశాలలో తనిఖీ చేస్తే పలుకులుగా ఉన్న అన్నం, కుళ్లిపోయిన కూరగాయలను గుర్తించారు. ఐటీడీఏ పరిధి విద్యాసంస్థల్లో రాజ్యమే లుతున్న నిర్లక్ష్యానికి ఈ రెండు ఘటనలు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ఆ అధికారి వల్లే అంతా...

భద్రాచలం ఐటీడీఏ పరిధిలో 50 ఆశ్రమ పాఠశాలలు, 20వసతి గృహాలు, 20 ప్రీ మెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. గడిచిన ఏడాదిన్నర కాలంగా విద్యాసంస్థల నిర్వహణ అధ్వానంగా మారిందనే విమర్శలు వస్తు న్నాయి. విద్యావ్యవస్థ గాడి తప్పడానికి ఆ శాఖలో కీలకంగా వ్యవ హరిస్తున్న ఓ అధికారి వ్యవహార శైలే కార ణమనే ఆరోపణలు వస్తున్నాయి. వ్యక్తిగత లాభమే లక్ష్యంగా సదరు అధికారి అధికారం చెలాయిస్తుండడం, 'మనీ' ముట్టజెబితే చాలు అక్రమాలను చూసీచూడనట్లు వదిలేసే ఆ అధికారి అక్రమాలకు అడ్డు చెప్పేవారే లేక విద్యావ్యవస్థలో ఒక్కో విభాగం నిర్వీర్యమవు తుందనే విమర్శలు వస్తున్నాయి..



భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం

ఐటీడీఏలో సమాంతర వ్యవస్థ నడుపుతున్న అధికారి

- విద్యార్థుల భోజనం, సరుకుల నాణ్యతపై నీలినీడలు
- వాస్తవ సంఖ్యతో పోలిస్తే ఎక్కువగా ఉన్నట్లు రికార్డులు
- టీచర్ల బదిలీలు, డిప్యూటేషన్లలోనూ అక్రమాలే

పాత్రల పంపిణీలోనూ...

ఐటీడీఏ విద్యాశాఖలో కీలకంగా వ్యవహరిస్తున్న అధికారి తీరుపై ఆది నుంచి విమర్శలే ఉన్నాయి. ఇంకో ఐటీడీఏలో పనిచేసిన సమయాన హాస్టళ్లకు స్టీల్ పాత్రలు సరఫరా చేయకుండానే చేసినట్లు బిల్లులు చెల్లించడం వివాదాస్పదమైంది. దీంతో ఆ అధికారిని భద్రాచలం బదిలీ చేసినా మార్పు రాలేదు. మారుమూల హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు.. రిజిస్టర్లలో సంఖ్యకు పొం తన ఉండడం లేదని సమాచారం. విద్యార్థుల సం ఖ్యను ఎక్కువగా చూపిస్తూ కొందరు వెల్ఫేర్ ఆఫీసర్లు గోల్‌మాల్ చేస్తున్న విషయం ఆ అధికారి దృష్టికి రావడంతో చర్యలు తీసుకోవాల్సింది పోయి ప్రోత్సహిస్తూ ప్రతిఫలం అందుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఒకటి, రెండు హాస్టళ్లలో సాగిన దందా ఇతర హాస్టళ్లకూ పాకినట్టు తెలుస్తోంది.

బదిలీల్లోనూ అదే తంతు

గిరిజన విద్యాశాఖలో ట్రాన్స్‌ఫర్లు, డిప్యూటేషన్ల విషయంలోనూ అంతా సదరు అధికారి ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఐటీడీఏ పరిధిలోని కొందరు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. సీని యారిటీ, రోస్టర్ పాయింట్లు, స్పౌజ్ తదితర నిబం ధనలేమీ అమలు కావడం లేదని.. ఆ అధికారి కరు ణ ఉంటే చాలు ఎక్కడైనా బదిలీ జరుగుతుందని చెబుతున్నారు. ఇటీవల గుండాల మండలం నుంచి దమ్మపేట మండలానికి జరిగిన ఓ జూనియర్ ఉపా ధ్యాయుడి బదిలీని ఇందుకు ఉదాహరణగా వివ రిస్తున్నారు. ఇలాంటి బదిలీలు, డిప్యూటేషన్లు జరు గుతున్నా అడ్డుకునే వారు లేకపోవడంతో ఆ అధికారికి కలిసొస్తుందనే విమర్శలు ఉన్నాయి.

ఆ నలుగురు

ఐటీడీఏ పరిధి విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యా యులు తమ సమస్యలపై సదరు అధికారిని కలిస్తే ఎంతకూ పరిష్కారం కావడం లేదంటున్నారు. కానీ ఆ అధికారి గ్రూపుగా పేరొందిన కొందరు ఉపాధ్యా యులను సంప్రదిస్తే మాత్రం చకచకా పూర్తవుతు న్నాయనేది ఐటీడీఏలో బహిరంగ రహస్యంగా మారింది. ఈ సమాంతర పాలనలో పాల్వంచ, ఇల్లెందు, దమ్మపేట, మణుగూరు మండలాల్లో పనిచేస్తున్న నలుగురు టీచర్లు కీలకంగా వ్యవహ రిస్తున్నట్టు సమాచారం. ఐటీడీఏ నిబంధనలకు విరుద్ధంగా సొంత వ్యవస్థ నడిపిస్తున్న వీరిపై చర్య లు తీసుకోవడంలో జాప్యంతో.. ఆ వ్యవస్థలో మరికొందరు ఉద్యోగులు చేరుతున్నారు. ఫలితంగా హాజరు మొదలు విద్యార్థులకు పెట్టే భోజనం, స్టడీ అవర్ల నిర్వహణ, సెలవు రోజుల్లో పిల్లలను కాపా డుకునే అన్ని అంశాల్లో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ఇప్పటికైనా ఐటీడీఏ పరిధి విద్యాశాఖను గాడిన పెట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ అంశంపై ఐటీడీఏ డీడీ మణెమ్మను వివరణ కోరేందుకు ఫోన్ లో సంప్రదించగా స్పందించలేదు.



గణపయ్యకు ఘననైవేద్యం

మణుగూరు అశోక్‌నగర్ వాసవీనగర్‌లో ప్రతిష్ఠిం చిన గణనాథుడికి శుక్రవారం భక్తులు 108 రకాల పిండివంటలతో నైవేద్యాలు సమర్పిం చారు. ఉదయం మహిళలు సామూహిక కుం కుమ పూజ చేశారు. ఆతర్వాత ఉండ్రాళ్లు, కుడుము లు, మోదకాలు, లడ్డూలు తదితర 108 రకాల పిండివంటలతో నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు. – మణుగూరు టౌన్

మళ్లీ మొదటి హెచ్చరిక



భద్రాచలంలో గోదావరి వరద ఉధృతి

భద్రాచలంలో పెరుగుతున్న గోదావరి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం అంతకంతకూ పెరుగుతోంది. గురువారం రాత్రి తగ్గుముఖం పట్టిన వరద శుక్రవారం తెల్ల వారుజామున ఒంటి గంటకు 36.40అడుగులుగా నమోదైంది. ఆతర్వాత ఉదయం 7గంటల వరకు తగ్గినా.. మళ్లీ పెరగడం మొదలైంది. ఉదయం 11గంటలకు 37అడుగులు, మధ్యాహ్నం ఒంటి గంటకు 38.20అడుగులు, సాయంత్రం 3గం టలకు 39.90, నాలుగు గంటలకు 40.80, 5 గం టలకు 41.50, 6 గంటలకు 42.20 అడుగులకు చేరడమే కాక రాత్రి 7–22 గంటలకు 43 అడుగు లుగా నమోదు కావడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆతర్వాత కూడా గోదావరికి వరద చేరుతూ నీటిమట్టం పెరుగు తుండగా రాత్రి 11గంటలకు 44.70 అడుగులుగా నమోదైంది. అయితే, గురువారం వరద తగ్గుము ఖం పట్టడంతో ఏజెన్సీ ప్రజలు ఊపిరి పీల్చుకుం టుండగానే మళ్లీ పెరుగుతుండడంతో ఎప్పుడేం జరుగుతోందనని ఆందోళనకు గురవుతున్నారు.

బయటకు రావొద్దు

గోదావరికి వరద పెరుగుతున్న నేపథ్యాన వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉం టూ అవసరమైతేనే తప్ప బయటకి రావొద్దని అధికారులు సూచించారు. సమస్య ఎదురైతే డయల్ 100కు లేదా కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలని అధికారులు తెలిపారు. అలాగే, కరకట్ట ప్రాంతంలో భక్తులు, స్థానికులు నదిలోకి వెళ్లకుండా మైక్ ద్వారా సిబ్బంది ప్రచారం చేస్తున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్

బూర్గంపాడు: వాతావరణంలో మార్పుల కారణం గా సీజనల్ వ్యాప్తి చెందుతున్నందున ఆశ్రమ పాఠ శాలల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ సూచించారు. బూర్గంపాడు మండ లం ఉప్పుసాకలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, ఒడ్డుగూడెం గిరిజన ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డార్మెటరీ హాళ్లు, డైనింగ్ హాళ్లు, వంట గదులు, సామగ్రిని పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారంపరిశు భ్రమైన పౌష్టికాహారం అందిస్తూ ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, వార్డెన్లు సమన్వయంతో పనిచేయా లని తెలిపారు. జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉంటే మెడికల్ క్యాంపులు నిర్వహించాలని చెప్పారు. కాగా, ఉప్పుసాక గిరిజన ఆశ్రమ పాఠశాలలో మెడి కల్ క్యాంపు వివరాలు, విద్యార్థుల ఆరోగ్య స్థితిగతు లపై నివేదిక ఇవ్వాలని డీఎంహెచ్‌ఓకు సూచిం చారు. ఒడ్డుగూడెం జీపీఎస్‌లో తనిఖీ సందర్భంగా ఉద్దీపకం వర్క్‌బుక్–2 ఆధారంగా బోధనపై పీఓ రాహుల్ ఆరా తీశారు.



విద్యార్థి సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న పీఓ రాహుల్

ఆలయ అభివృద్ధి, భక్తులకు సేవలు

ఈఓగా బాధ్యతలు స్వీకరించిన దామోదర్‌రావు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఈఓ దామోదర్ రావు తెలిపారు. ఇదే సమయాన భక్తులకు మెరు గైన సేవలు అందించడంపై దృష్టి సారిస్తానని వెల్ల డించారు. ఈఓగా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించగా.. తొలుత ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకు న్నారు. ఈ సందర్భంగా ఉపాలయంలో పండితు లు వేదాశీర్వచనం చేసి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం కార్యాలయంలో బాధ్యత లు చేపట్టిన దామోదర్‌రావు మాట్లాడారు. భద్రాచ లం ఆర్‌డీఓగా పని చేసిన అనుభవం ఉందని, ఇటీ వల మాడ వీధుల విస్తరణలో భూసేకరణ చేసినట్లు తెలిపారు. ఆలయంలో వైదిక కమిటీ, అర్చకులు, పండితులను సమన్వయం చేసుకుంటూ ముం దుకు సాగుతానని వెల్లడించారు. ఆలయ అభివృ ద్ధికి తగిన ప్రతిపాదనలను రూపొందించి అమల య్యేలా కృషి చేస్తానని తెలిపారు. కాగా, నిత్యాన్న దానానికి సంబంధించి బ్యాంకులో డిపాజిట్ రూ.70 లక్షలు చేసే పత్రంపై దామోదర్‌రావు తొలి సంతకం చేశారు. ఆలయ ఏఈఓ భవానీ రామకృ ష్ణ, ప్రధాన అర్చకులు సీతారామానుజాచార్యు లుతో పాటు ఉద్యోగులు, అర్చకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న దామోదర్‌రావు

కష్టపడి చదివితేనే లక్ష్యసాధన

- తల్లిదండ్రుల త్యాగాలను వృథా కానివ్వొద్దు
- 'ఎర్త్ సైన్స్' ఓరియంటేషన్‌లో కలెక్టర్ పాటిల్

కొత్తగూడెంఅర్బన్: తల్లిదండ్రుల త్యాగాలను నిత్యం గుర్తుచేసుకుంటూ వారి కష్టం వృథా కాకుం డా విద్యార్థులు చదవాలని.. తద్వారా లక్ష్యాలను చేరుకోవచ్చని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ తొలి బ్యాచ్ ఇంజనీరింగ్, బీఎస్సీ విద్యార్థులకు శుక్రవారం ఓరియెంటేషన్ ఏర్పాటుచే శారు. కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రామచంద్ర, జియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ మల్లికార్జునరెడ్డితో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభిం చిన కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్ల లను ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు పం పేందుకు ఆందోళన చెందుతారని తెలిపారు. కానీ ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా చదివేలా యూనివర్సిటీలో అన్ని వసతులు ఉన్నాయని చెప్పారు. విద్యార్థులు కూడా తల్లిదండ్రుల నమ్మ కాన్ని నిలబెట్టేలా శ్రద్ధగా చదవాలని సూచించారు. తాను చదివే సమయాన సరైన సౌకర్యాలు లేక కి.మీ. నడిచే వెళ్లేవాళ్లమని.. అయినా మంచి ఉపా ధ్యాయులు, ల్యాబ్ సౌకర్యాలు ఉండడంతో ఈ స్థాయికి చేరానని తెలిపారు. జిల్లాలో బొగ్గు గను లు, భారజల కర్మాగారం వంటివి ఉన్నందున ఇక్కడ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటుచేశారని, ఫలితంగా విద్యార్థులు ప్రత్యక్షంగా అధ్యయనం చేస్తూ చదువు పూర్తిచేయొచ్చని కలెక్టర్ వివరిం చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్మో హన్‌రాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాము, ప్రొ ఫెసర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్, పక్కన రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు

తొలి బ్యాచ్‌లో సీటు.. అదృష్టం



ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ తొలి బ్యాచ్‌లో సీటు రావడం అదృ ష్టంగా భావిస్తున్నా. యూనివ ర్సిటీతో పాటు తల్లిదండ్రులకు పేరు తెచ్చేలా విద్యనభ్యసిస్తా. కలెక్టర్ ప్రసంగం మాలో ఎంతగానో స్ఫూర్తిని నింపింది. – విసెష్, హైదరాబాద్

మైనింగ్‌లో జాయిన్ అయ్యా



బొగ్గుగనుల ప్రాంతంలో పెర గడం వల్ల మైనింగ్ కోర్సుపై మక్కువ పెరిగింది. అందుకే మైనింగ్ విభాగంలో సీటు ఎం చుకున్నా. మైనింగ్ కోర్సు పూర్తి చేసి సింగరేణిలో ఉద్యోగం సాధించడమే లక్ష్యం. – శివమల్లిక, మంచిర్యాల

ప్రిస్క్రిప్షన్ లేకుండా మాత్రలు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: అర్హత కలిగిన వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా గర్భస్రావ మాత్రలు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి హెచ్చరించారు. కొత్తగూడెంలో శుక్రవారం నిర్వహిం చిన మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ(ఎంటీపీ) కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. సమాజం లో లింగ నిష్పత్తి తగ్గుతున్న నేపథ్యాన అక్రమ గర్భ స్రావాల నిరోధానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలి పారు. ఈమేరకు అనధికార అమ్మకాల కట్టడికి సహ కరించాలని సూచించారు. జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, అదనపు డీఎంహెచ్‌ఓ సైదులు, వైద్యులు మధువ రన్, తేజశ్రీ, ఫయాజ్ మొహినుద్దీన్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టులకు మంగళం!

- ఉమ్మడి జిల్లాలో మూడింటి ఎత్తివేత
- 40 ఏళ్ల నాటి పాల్వంచ చెక్‌పోస్ట్ సైతం మూత

ఖమ్మంక్రైం: రాష్ట్ర సరిహద్దుల్లో అన్నిరకాల చెక్ పోస్టులను ఎత్తివేస్తున్నట్లు రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్ తాజాగా వెల్లడించారు. ఇం దుకు సంబంధించి శుక్రవారం ఉత్తర్వులు అం దినట్లు తెలిసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో మూడు చెక్‌పోస్ట్‌ల తొలగింపునకు రవాణా శాఖాధికారులు సమయాత్తమవుతున్నారు.

వరుస ఆరోపణలతో...


ఇతర రాష్ట్రాలకు సరుకులు తీసుకెళ్లే వాహనాలకు నేషనల్ పర్మిట్ లేకపోతే పన్ను వసూళ్ల కోసం చెక్ పోస్టులను ఏర్పాటుచేశారు. ఆయా చెక్‌పోస్టుల్లో ఏడు, 15, 30రోజుల పరిమితితో తాత్కాలిక పర్మిట్లు జారీ చేసేవారు. అయితే, చెక్‌పోస్ట్‌ల్లో సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడం.. ఏసీబీ తనిఖీల్లో నిజమేనని తేలడంతో ప్రభుత్వం వీటి తొలగింపునకు నిర్ణయించినట్లు సమాచారం. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం ముత్తగూడెం, భద్రాద్రి కొత్త గూడెం జిల్లా పాల్వంచ, అశ్వారావుపేటలోని చెక్ పోస్టులను ఎత్తివేయనున్నారు. ఇందులో పాల్వంచ చెక్‌పోస్టు 40ఏళ్ల క్రితం ఏర్పాటు కాగా, అశ్వారావు పేట, ముత్తగూడెం చెక్‌పోస్టులు తెలంగాణ ఆవిర్భ వించాక ఏర్పాటయ్యాయి.

సిబ్బంది ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు...

చెక్‌పోస్టులు తొలగించనుండడంతో అందులోని సిబ్బందిని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి బదిలీ చేయనున్నారు. ముత్తగూడెం చెక్‌పోస్ట్‌లో ఒక ఎం వీఐ, ఏఎంవీఐ, పాల్వంచలో ఒక ఏఎంవీఐ, అశ్వా రావుపేటలో ఒక ఎంవీఐ, ఏఎంవీఐ విధులు నిర్వ ర్తిస్తుండగా వీరు ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేయను న్నారు. కాగా, చెక్‌పోస్ట్‌ల ఎత్తివేతపై ఉత్తర్వులు అం దినా తేదీపై స్పష్టత లేదని రవాణా శాఖ అధికారు లు వెల్లడించారు.

తాలిపేరుకు తగ్గిన వరద

చర్ల: మండలంలో ని పెదమిడిసిలేరు సమీపాన ఉన్న తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టింది. మూడు రోజులుగా 92 వేల క్యూసెక్కుల వరద రాగా, అది శుక్రవారం సాయంత్రానికి తగ్గింది. దీంతో ఐదుగేట్ల ద్వారా 8,637 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తు న్నారు. వరద నేపథ్యాన తేగడలోని లోలెవెల్ చప్టా పైకి సుమారు 15 అడుగుల మేర వరద చేరగా, దం డుపేట – కొత్తపల్లి మార్గంలో ప్రధాన రహదారిపైకి సైతం గోదావరి బ్యాక్ వాటర్ రావడంతో రాకపో కలు నిలిచిపోయాయి. అంతేకాక పలు గ్రామాల్లో వరి, పత్తి పంటలను వరద ముంచెత్తింది.



తాలిపేరు నుంచి విడుదలవుతున్న వరదనీరు

క్లుప్తంగా

జిల్లా జడ్జిని కలిసిన న్యాయమూర్తులు


వినయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం జిల్లా కోర్టులో మూడో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వనం వినయ్‌కుమార్ శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే, వినయ్‌కుమార్‌ను జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు సన్మానించారు. ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామిశెట్టి రమేశ్, డీకొండ రవికుమార్‌తో పాటు లగడపాటి సురేశ్, నిమ్మల మల్లికార్జున్, ఈ.మీనాకుమారి, జి.ప్రమీల, హెచ్.సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే, భద్రాచలం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ దుర్గాభవాని కూడా జిల్లా జడ్జి పాటిల్ వసంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నిరుద్యోగ యువతకు 'నవ లిమిటెడ్' చేయూత


సర్టిఫికెట్లు అందిస్తున్న సంజీవరావు, తదితరులు

పాల్వంచ: నిరుద్యోగ యువతకు నవ లిమిటెడ్ సంస్థ చేయూతగా నిలుస్తోందని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ కె.సంజీవరావు తెలిపారు. పాల్వంచలోని నవ ఒకేషనల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఫిట్టర్, ఎలక్ట్రికల్ ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఆయన సర్టిఫికెట్లు అంజేసి మాట్లాడారు. యువత ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా వృత్తి విద్యా కోర్సులపై దృష్టి సారించాలని సూచించారు. నవ లిమిటెడ్ జనరల్ మేనేజర్ (సీఎస్‌ఆర్) ఎంజీఎం ప్రసాద్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 1,711 మందికి పైగా శిక్షణ ఇవ్వగా, పలువురు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎస్.సురేశ్‌చంద్ర, లైజన్ ఆఫీసర్ ఖాదరేంద్ర బాబు, మేనేజర్ సీహెచ్.శ్రీనివాసరావు, యూఎస్ఎన్.శర్మ, బిన్ను, సాయి, శ్రావణ్, శ్యాం, అలీ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రత ఆధారంగా రేటింగ్


మాట్లాడుతున్న డీఈఓ నాగలక్ష్మి


కొత్తగూడెంఅర్బన్: పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత ఆధారంగా రేటింగ్ ఇవ్వనున్నట్లు డీఈఓ బి.నాగలక్ష్మి తెలిపారు. కొత్తగూడెంలో ఉపాధ్యాయులకు శుక్రవారం ఏర్పాటు చేసిన శిక్షణలో ఆమె మాట్లాడారు. రేటింగ్ ద్వారా ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని చెప్పారు. అందుకోసం ప్రతి పాఠశాల నుంచి పూర్తి వివరాల తో తప్పనిసరిగా సెప్టెంబర్ 30లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జిల్లా కోఆర్డినేటర్ ఎస్కే సైదులు మాట్లాడుతూ.. 2021లో ఇదే కార్యక్రమం ద్వారా జిల్లా పాఠశాలలు జాతీయస్థాయికి ఎంపికయ్యాయని గుర్తు చేశారు. అదేస్ఫూర్తితో ఈసారి కూడా అవార్డులు పొందేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయా లని పేర్కొన్నారు. శిక్షణలో జిల్లా రిసోర్స్ పర్సన్లు స్వరూప్‌కుమార్, కోటేశ్వరరావు ఆన్‌లైన్ నమోదు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు ఎస్కే సైదులు, ఎ.నాగరాజు శేఖర్, ఎన్.సతీశ్‌కుమార్, మండల రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

సీతారామ కెనాల్ నిర్మాణానికి భూసర్వే


సీతారామ కెనాల్ భూసేకరణ కోసం సర్వే నిర్వహిస్తున్న సర్వేయర్లు

జూలూరుపాడు: మండలంలో సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాల్వ నిర్మాణం కోసం శుక్రవారం భూసర్వే నిర్వహించారు. కెనాల్ నిర్మాణం 104 కి.మీ. మేర పూర్తి కాగా, మిగిలిన కాల్వ నిర్మాణం కోసం భూసేకరణ పెండింగ్‌లో ఉంది. ఈ విషయంలో స్పష్టత లేక పాపకొల్లు, రాజారావుపేట, భోజ్యాతండా రైతులు నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యాన కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఆదేశాల మేరకు పాల్వంచ ఎస్‌డీసీ కార్తీక్ పర్యవేక్షణలో జూలూరుపాడు తహసీల్దార్ టి.శ్రీనివాస్ ఆధ్వర్యాన సర్వే చేపట్టారు. సుమారు 2.5కి.మీ. మేర కెనాల్ భూసేకరణ కోసం సర్వేయర్ ప్రవీణ్ తదితరులు సర్వే నిర్వహించారు. సర్వే పూర్తయితే సీతారామ మెయిన్ కెనాల్ కింద భూములు కోల్పోయిన పాపకొల్లు, రాజారావుపేట, భోజ్యాతండా రైతులకు ప్రభుత్వ నష్టపరిహారం అందనుంది. ఆర్ఐ సీహెచ్.ఆదినారాయణ, సర్వేయర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052

ఇంకా సాధారణమే..

- జిల్లాలోని 11 మండలాల్లోనే అధిక వర్షపాతం
- మిగతా అన్నిచోట్ల అంతంతే..
- సరాసరి వర్షపాతం 32.9 మి.మీ.గా నమోదు
- చివరి దశలో పంటల సాగు


వరి పొలంలో మందు పిచికారీ చేస్తున్న రైతు (ఫైల్)

సూపర్‌బజార్(కొత్తగూడెం): వర్షాలు దంచి కొడుతున్నా జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతమే నమోదైంది. ఈ వర్షాకాలం వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదు. అయినప్పటికీ వాయుగుండాల కారణంగా వర్షాలు కురుస్తుండడంతో ఆమాత్రం అయినా వర్షపాతం నమోదైందని గణాంకాలు చెబుతున్నాయి. జూన్‌లో సాధారణ వర్షపాతం 169.1 మి.మీ.కు గాను 134.4 మి.మీ.గా నమోదవడంతో 20.5లోటు ఏర్పడింది. ఇక జూలైలో సాధారణ వర్షపాతం 312.7 మి.మీ.కు 378.9 మి.మీ కురిసి 21.2శాతం అధికవర్షపాతం నమోదైంది. అలాగే, ఈనెల ఇప్పటి వరకు 269 మి.మీ. వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా 369.9 మి.మీగా కురవడంతో 30.1 శాతం అధిక వర్షపాతం నమోదైంది. మొత్తంగా జిల్లాలోని 23 మండలాల్లో సరాసరి 15మి.మీ. వర్షపాతం నమోదైందని గణాంకాలు చెబుతున్నాయి.

ఒకేరోజు 32.9 మి.మీ.

దాదాపు జిల్లా అంతటా గురువారం వర్షం కురిసింది. దీంతో జిల్లా సగటు 32.9 మి.మీ.గా నమోదైంది. అధికంగా జూలూరుపాడులో 73.2 మి.మీ., దమ్మపేట మండలంలో 67.6మి.మీ., అన్నపురెడ్డిపల్లి మండలంలో 62.6మి.మీ., ములకలపల్లి మండలంలో 62.4 మి.మీ., చంద్రుగొండ మండలంలో 66.2 మి.మీ., లక్ష్మీదేవిపల్లి మండలంలో 38.8 మి.మీ., టేకులపల్లి మండలంలో 38.4 మి.మీ., కొత్తగూడెంలో 36.4 మి.మీ., సుజాతనగర్ మండలంలో 35.6 మి.మీ., అశ్వారావుపేట మండలంలో 34 మి.మీ., పాల్వంచ మండలంలో 33.6 మి.మీ., ఇల్లెందు మండలంలో 30.6 మి.మీ., గుండాల మండలంలో 28.4 మి.మీ., చుంచుపల్లి మండలంలో 24.8 మి.మీ.తో పాటు కరకగూడెం మండలంలో 24.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇతర మండలాల్లో వర్షప్రభావం ఉంది.

11 మండలాల్లో అధికం..

జూన్ 1వ తేదీ నుంచి జిల్లాలోని 11 మండలాల్లో ఇప్పటివరకు అధికవర్షపాతం నమోదైంది. ఈ జాబితాలో మణుగూరు, ఇల్లెందు, టేకులపల్లి, జూలూరుపాడు, చంద్రుగొండ, చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం, పాల్వంచ, బూర్గంపాడు, అశ్వారావుపేట మండలాలు ఉన్నాయి. అలాగే, కరకగూడెం, పినపాక, చర్ల, దుమ్ముగూడెం, అశ్వాపురం, ఆళ్లపల్లి, గుండాల, అన్నపురెడ్డిపల్లి, లక్ష్మీదేవిపల్లి, భద్రాచలం, ములకలపల్లి, దమ్మపేట మండలాల్లో ఇప్పటికీ సాధారణ వర్షపాతమే నమోదైంది.

వరి, మిర్చి మినహా..

ఈ వానాకాలంలో జిల్లాలో అన్ని పంటలు కలిపి 5,91,714ఎకరాల్లో సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. అయితే, సీజన్ ప్రారంభంలో వర్షాలు మందకొడిగా ఉండడంతో సాగు నెమ్మదిగా మొదలైంది. ఆ తర్వాత వర్షాల ఆధారంగా పంటల సాగు క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఇప్పటికే సాధారణ విస్తీర్ణం కంటే 8,859 ఎకరాల మేర ఎక్కువగా పంటలు సాగు చేయగా.. మొత్తం 6,00,673 ఎకరాల్లో సాగైనట్లు అధికారులు గుర్తించారు. వరి సాధారణం కంటే 13,906 ఎకరాల్లో ఇంకా నాట్లు వేయాల్సి ఉంది. అలాగే, మిర్చి సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే 10,283 ఎకరాల్లో ఇంకా పంట మొదలు కాలేదు. మిగతావన్నీ అంచనాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యాయని అధికారులు చెబుతున్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- ధ్యాన్‌చంద్ జీవితం అందరికీ ఆదర్శం
- క్రీడాదినోత్సవంలో కలెక్టర్ పాటిల్


క్రీడా పోటీల్లో విజేతలతో కలెక్టర్ పాటిల్, అధికారులు, కోచ్‌లు

కొత్తగూడెంటౌన్: మేజర్ ధ్యాన్‌చంద్ జీవితం అందరికీ ఆదర్శనీయమని.. ఆయన స్ఫూర్తిగా విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ సూచించారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో శుక్రవారం జరిగిన జాతీయ క్రీడా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల ఇష్టాన్ని తెలుసుకుని క్రీడల్లో రాణించేలా ప్రోత్సాహం అందించాలని తెలిపారు. క్రీడల్లో రాణిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ చెప్పారు.

విద్యార్థులకు పతకాలు

ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో విజేతలకు కలెక్టర్ పాటిల్ పతకాలు అందజేశారు. అండర్–9 బాలికల విభాగంలో ఫాతిమా, పి.అతిదిప్రియ, రజిత, డి.భవంతి, అండర్–10లో కె.సహస్ర, ఎల్.నాగజేశ్విత, ఎస్కే సైమా, పుండరీకాక్ష, అండర్–11లో జి.మాన్విత, జె.ప్రశాంతి, ఎస్కే సైమా వరుసగా మొదటి, రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి ఎం. పరంధామరెడ్డి, వివిధక్రీడా అసోసియేషన్ల బాధ్యులు యుగేంధర్‌రెడ్డి, నరేశ్, ఎర్రా కామేశ్, వై.వెంకటేశ్వర్లు, సావిత్రి, షమీవుద్దీన్, యాకూబ్, కిరణ్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు. కాగా, కొత్తగూడెంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డు వద్ద శనివారం సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి తెలిపారు.

ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు తెలపండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో కలిసి వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 471 జీపీల్లో మొత్తం 6,69,024 ఓటర్లకు గాను పురుషులు 3,25,033, మహిళలు 3,43,967 మంది, ఇతరులు 24 మంది ఉన్నారని తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30 సాయంత్రంలోగా లిఖిత పూర్వకంగా మండల కార్యాలయాల్లో అందించాలని సూచించారు. అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం అనంతరం సెప్టెంబర్ 2న తుది ఓటర్ల జాబితా వెలువరిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డీపీఓ చంద్రమౌళి, వివిధ పార్టీల నాయకులు లక్ష్మణ్, బాలప్రసాద్, రేగా కాంతా రావు, సలిగంటి శ్రీనివాస్, అన్నవరపు సత్యనారాయణ, నరేందర్, నోముల బాలు, ఎ.రాంబాబు పాల్గొన్నారు.

సెర్ప్ కోఆర్డినేటర్ల బదిలీ కౌన్సెలింగ్

డీఆర్‌డీఓ పరిధి 83 క్లస్టర్లలో ఉన్న 93 మంది సెర్ప్ కోఆర్డినేటర్లకు శుక్రవారం బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. కలెక్టర్ పాటిల్, డీఆర్‌డీఓ విద్యాచందన నేతృత్వాన ఈ కౌన్సెలింగ్ జరిగింది. స్పౌజ్ కేటగిరీ, 70 శాతం పైబడిన వైకల్యం, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తూ కౌన్సెలింగ్ నిర్వహించారు. అడిషనల్ డీఆర్‌డీఓ బి.నీలయ్య, సూపరింటెండెంట్ కె.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

క్రెడిట్ సొసైటీ ఎన్నికలకు నోటిఫికేషన్

- పాల్వంచలో నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- వచ్చేనెల 10న ఓటింగ్, అదేరోజు ఫలితాలు


పాల్వంచలోని కేటీపీఎస్ కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయం

పాల్వంచ: కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్ ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ (పాల్వంచ) ఎన్నికలకు నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి జి.గంగాధర్ శుక్రవారం విడుదల చేశారు. శనివారం, సోమ, మంగళవారాల్లో నామినేషన్లను పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో స్వీకరిస్తారు. ఆ తర్వాత 3వ తేదీన నామినేషన్లు పరిశీలించి ఉపసంహరణల అనంతరం తుది జాబితా విడుదల చేయ డంతో పాటు బరిలో మిగిలిన అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు. వచ్చేనెల 10వ తేదీన పాల్వంచలోని డీఏవీ హైస్కూల్, మణుగూరు బీటీపీఎస్‌లోని ఎస్‌పీఎఫ్ భవనం, నల్లగొండ జిల్లా దామరచర్ల వైటీపీఎస్‌లోని స్టోర్స్ ఆఫీస్‌లో బ్యాలెట్ విధానంలో పోలింగ్ నిర్వహిస్తారు. ఆ తర్వాత బ్యాలెట్ బాక్స్‌లను పాల్వంచ డీఏవీ స్కూల్‌కు చేర్చి అదేరోజు ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

మొత్తం 3,008 ఓట్లు

గతంలో కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలోనే కోఆపరేటివ్ ఉద్యోగుల సొసైటీ కొనసాగేది. అయితే, పాత ప్లాంట్‌ను మూసివేయడమే కాక కొత్తగా బీటీపీఎస్, వైటీపీఎస్ ప్లాంట్ల నిర్మాణంతో పలువురు ఉద్యోగులు అక్కడకు బదిలీపై వెళ్లారు. దీంతో ఇక్కడి సొసైటీ సభ్యులు ఆయా కర్మాగారాల్లో విధులు నిర్వహిస్తుండగా వారూ ఓటింగ్‌లో పాల్గొనేలా మూడు చోట్ల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సొసైటీలో మొత్తం 3,008 మంది సభ్యులు ఉండగా, కేటీపీఎస్‌లో 2,100, బీటీపీఎస్‌లో 504, వైటీపీఎస్‌లో 404 మంది ఓటు వేయనున్నారు. కాగా, మొత్తం 13 డైరెక్టర్ పోస్టులకు ఎన్నిక జరుగుతుండగా ఏడు జనరల్, రెండు బీసీ జనరల్‌కు, ఎస్సీ జనరల్, ఉమెన్, ఎస్టీ జనరల్, ఉమెన్‌కు ఒక్కో పోస్టు కేటాయించారు. ఇప్పటి వరకు సుమారు 15 మంది బరిలో నిలిచేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు సమాచారం.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

పాల్వంచరూరల్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదు నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి అన్వేశ్ తెలిపారు. ప్రవేశపరీక్ష రాసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. హాల్ టికెట్, ర్యాంక్ కార్డు లేదా మెరిట్ జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో శనివారం సాయంత్రం 4 గంటల్లోగా అందు బాటులో ఉన్న స్కూల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. తల్లిదండ్రులు లేని పిల్లలు ప్రవేశ పరీక్ష రాయకున్నా అర్హులేనని తెలిపారు. పూర్తి వివరాలకు 97045 50206 సంప్రదించాలని అన్వేశ్ సూచించారు.

'పెదవాగు' పునర్నిర్మాణానికి కృషి చేయండి

జాతీయ ఎస్టీ, ఎస్సీ కమిషన్ సభ్యుడికి వినతి


హుస్సేన్‌నాయక్‌తో మాజీ మంత్రి జలగం, రైతులు

అశ్వారావుపేటరూరల్: జాతీయ ఎస్టీ, ఎస్సీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్‌ను అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి సమీపాన పెదవాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతులు మాజీ మంత్రి జలగం ప్రసాద్‌తో కలిసి హైదరాబాద్‌లో శుక్రవారం కలిశారు. గతేదాది జూలై 18వ తేదీన కురిసిన భారీ వర్షంతో ప్రాజెక్టు ప్రధాన ఆనకట్టకు గండ్లు పడ్డాయి. ఆ తర్వాత తాత్కాలికంగా రింగ్ బండ్ నిర్మించినా ప్రాజెక్టు పునఃనిర్మాణాన్ని ఎవరూ పట్టించుకోలేదు. దీంతో రెండు రాష్ట్రాలకు చెందిన ఆయకట్టు రైతులతోపాటు మాజీ మంత్రి జలగం ప్రసాద్ నేతృత్వాన హుస్సేన్‌నాయన్‌ను కలిసి ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు పునఃనిర్మించేలా కృషిచేయాలని కోరారు. రైతులు పుట్టా సత్యం, చిమడబోయిన శ్రీను, గారపాటి పుల్లారావు, శెట్టిపల్లి కృష్ణారెడ్డి, సాయిల వీరబాబు, దేరంగుల దుర్గయ్య, కొండపాటి శ్రీరామచంద్రమూర్తి, కంగాల కల్లయ్య, చాపర్ల శ్రీనివాసరావు, పద్దం రమేశ్, కొర్రి రామా రావు, కుంజా విజయ్ పాల్గొన్నారు.

పెన్షన్ విద్రోహ దినం పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు సెప్టెంబర్ 1వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పెన్షన్ విద్రోహ దినం జరుపుతున్నట్లు టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ రామారావు, సెక్రటరీ జనరల్ సంగం వెంకటపుల్లయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట పెన్షన్ విద్రోహదినం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1న పాల్వంచ బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులతో మహా బైక్‌ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో జేఏసీ భాగస్వామ్య పక్షాలైన సంఘాలు,డ్రైవర్ల సంఘం, సీపీఎస్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

50 కేజీల గంజాయి స్వాధీనం


నిందితులు, గంజాయితో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ సురేశ్

పినపాక: మండలంలో భారీ మొత్తంలో గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు ఐదుగురుని అదుపులోకి తీసుకున్నారు. సీఐవెంకటేశ్వర్లు శుక్రవారం సాయంత్రం వివరాలు వెల్లడించారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు ఓ వ్యక్తి పల్సర్ బైక్‌పై ఎస్కార్ట్‌గా వస్తుండగా మరో నలుగురు వ్యక్తులు మూడు కార్లలో గంజాయి రవాణా చేస్తున్నారు. పినపాక ఎక్స్ రోడ్ వద్ద వాహనాలను తనిఖీ చేయగా రూ.25లక్షల విలువైన 50 కేజీల గంజాయి లభించింది. నిందితులు పల్లెపు శ్రీకాంత్, దాసరి వెంకటేశ్వరరావు, మడకం రాజు, కొండూరి వినయ్, తంబళ్ల పుల్లారావును అదుపులోకి తీసుకుని, మూడు కార్లు, ఒక బైక్, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

హసాన్ కోసం ఆపన్నహస్తాలు

అశ్వారావుపేట: ఓ ఆర్ఎంపీ నిర్వాకంతో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మత గురువు షేక్ హసాన్‌కు పలువురు దాతలు అండగా నిలుస్తున్నారు. ఆయన పరిస్థితిపై శుక్రవారం 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా.. ఫోన్‌పే ద్వారా రూ.25 వేలు జమ చేశారు. ముస్లిం కమిటీ బాధ్యులతో పాటు మత గురువు జాకీర్, షాకీర్ నేతృత్వాన విరాళాలు సేకరిస్తున్నారు. అయితే, హసాన్ చికిత్స కోసం రోజుకు రూ.40 వేలు ఖర్చవుతున్నందున దాతలు చేయూతనివ్వాలని పలువురు కోరుతున్నారు.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా


బోల్తాపడిన ఆయిల్ ట్యాంకర్

దమ్మపేట: క్రూడ్ పామాయిల్ లోడ్‌తో వెళ్తున్నట్యాంకర్ బోల్తా పడిన ఘటన మండలంలోని కొమ్ముగూడెం శివారులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని అప్పారావు పేట పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి తమిళనాడుకు 25 టన్నుల క్రూడ్ పామాయిల్ లోడుతో ఒక ట్యాంకర్ బయలుదేరింది. ఈ క్రమంలో ఆ లారీ కొమ్ముగూడెం శివారులో ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. లారీడ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. కాగా ట్యాంకర్ నుంచి ఆయిల్ నష్టం కూడా జరగలేదు.

యూరియా కోసం అవస్థలు


నిజాంపేట విక్రయ కేంద్రం వద్ద బారులుదీరిన రైతులు


యూరియా బస్తా టోకెన్ కోసం క్యూలో రైతులు

ఇల్లెందురూరల్: మండలంలో యూరియా విక్రయం కోసం పీఏసీఎస్ ఆధ్వర్యంలో మూడు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతీ రోజు విక్రయ కేంద్రం వద్ద వందల సంఖ్యలో రైతులు యూరియా కావాలంటూ బారులు తీరుతున్నారు. ఇప్పటివరకు ఆధార్ కార్డు ఆధారంగా యూరియా విక్రయించిన అధికారులు రద్దీ అధికం కావడంతో పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ చూపిస్తేనే పంపిణీ చేస్తామని శుక్రవారం నిజాంపేట విక్రయ కేంద్రం వద్ద షరతు పెట్టారు. ఈ విషయంలో రెండు రోజులుగా పట్టాదారు పాస్‌పుస్తకాలు లేని రైతులు విక్రయ కేంద్రాల వద్ద నిరసన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. రైతుల సంఖ్యకు అనుగుణంగా యూరి యా స్టాక్ లేకపోవడంతో ముందుగా రైతుల వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి టోకెన్‌లను అందజేస్తున్నారు. ఈ సమయంలో ఎలాంటి ఘర్షణ చోటు చేసుకోకుండా ఇల్లెందు సీఐ సురేశ్ బందో బస్తు నిర్వహించారు. మధ్యాహ్నం తరువాత పోలీస్‌పహారాలో టోకెన్ నంబర్ల వారీగా పిలిచి యూరియా విక్రయాలు చేపట్టారు. తెల్లవారు జామునే విక్రయ కేంద్రం వద్దకు చేరుకున్న రైతులు ఒక్క బస్తా కోసం క్యూలెన్లో నిలబడి ఆధారాలు అందజేసి టోకెన్ అందితే మధ్యాహ్నంతరువాత యూరియా తీసుకుంటున్నారు.

ఇరు వర్గాల మధ్య దాడులు

పాల్వంచ: స్థానిక కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయం యూరియా పంపిణీ కేంద్రం వద్ద ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. యూరియా బస్తాలను ఆటోల్లో పంపిస్తుండగా కోడిపుంజుల వాగు పూసలతండాకు చెందిన ఓ మహిళకు, హమాలీలకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. మహిళా రైతు తొలుత హమాలీపై చేయిచేసుకోగా, ఆటోడ్రైవర్ ఘర్షణకు దిగాడు. హమాలీ ముఠా సభ్యులు భారీసంఖ్యలో అక్కడికి చేరుకుని తిరిగి మహిళ, ఆటోడ్రైవర్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆటోడ్రైవర్ అంబేడ్కర్‌సెంటర్‌వైపు పరుగులు తీయగా, వెంటపడి హమాలీలు దాడికి పాల్పడ్డారు. పోలీస్ సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేసినా ఫలించలేదు. ఈ విషయమై ఎస్ఐ సుమన్‌ను వివరణ కోరగా హమాలీలు ఫిర్యాదు చేశారని, బస్తాలు వేసి డబ్బులు ఇవ్వకుండానే ఆటో తీసుకెళ్తుండగా అడిగినందుకు దాడి చేశారని వెల్లడించారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ శుక్రవారం ప్రారంభమైంది. అండర్–15 విభాగంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రారంభించి మాట్లాడుతూ జిల్లా నుంచి బ్యాడ్మింటన్ క్రీడలో ఎందరో ఉన్నత స్థాయికి చేరారని, ఈ వారసత్వాన్ని యువత కొనసాగించాలని సూచించారు. బ్యాడ్మింటన్ శిక్షణకు అన్ని వసతులు ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏఎస్పీ జి.వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు కర్నాటి వీరభద్రం మాట్లాడుతూ జిల్లా నుంచి నైపుణ్యం కలిగిన క్రీడాకారులను తీర్చిదిద్దడమే తమ ధ్యేయమన్నారు. డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి మాట్లాడగా కార్పొరేటర్ కమర్తపు మురళి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వి.చంద్రశేఖర్‌తో పాటు సిరిపురపు సుదర్శన్, పి.రవిమారుత్, పి.యుగంధర్, దుద్దుకూరి సత్యనారాయణ, జట్ల శ్రీను, కొంగర శ్రీనివాస్, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రీ క్వార్టర్‌కు చేరిన టోర్నీ

రాష్ట్రస్థాయి అండర్–15 బ్యాడ్మింటన్ పోటీలు ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాయి. బాలబాలికల నాకౌట్ పోటీలు శుక్రవారం రాత్రి పూర్తయ్యాయి. శనివారం నుంచి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు.